క్లుప్తంగా

అలరించిన హిడింబాసుర, బకాసుర వధ



భిక్షాటనకు బయలుదేరిన భీమ వేషధారులు

శ్రీకాళహస్తి: చెన్నైరోడ్డులోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడవరోజైన ఆదివారం హిడింబాసుర, బకాసుర వధ ఘట్టం ప్రదర్శన భక్తులను అలరించింది. ఆదివారం ఉదయం భీమ వేషధారి పట్టణంలోని పలు ప్రాంతాల్లో భిక్షాటన చేశారు. అనంతరం హిడింబాసుర, బకాసుర వధ ఘట్టం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



ఆలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ నటరాజన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.నటరాజన్ తమ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆటోలతో ట్రాఫిక్‌కు అంతరాయం



మెయిన్ రోడ్డుపై నిలిచి ఉన్న ఆటోలు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక మెయిన్‌రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలపడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా నిలిపి ఉంచడంతో ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కలుగుతోంది. అంతేకాకుండా షాపుల ముందు కూడా పెట్టడంతో షాపుల యాజమానులు అవస్థలు పడుతున్నారు. ఆటోవాలాలను నియంత్రించవలసిన పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఆటోవాలాలను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

వైఎస్సార్ బీమా సాయం పంపిణీ

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలను అందజేశారు. గ్రామస్తుడు అబ్బు సుబ్రమణ్యం(40) శనివారం మృతి చెందాడు. సమాచారం అందిన సర్పంచ్ లలిత బాధిత కుటుంబంతో వైఎస్సార్ బీమాకు దరఖాస్తు చేయించి తక్షణ సాయం అందజేశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకుడు కరుణాకరన్, రాజా, చంద్ర, రోశయ్య, బాల, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతి కోసం క్రైస్తవుల ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్టీసీ కూడలిలోని అంబేడ్కర్ కూడలి వద్ద శాంతి కోసం ఆదివారం క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. వారు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులు, చర్చిలపై దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అక్కడ శాంతి నెలకొనాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు సుందరరాజ్, జీవమణి, అంబ్రోస్, మణిబాబు, డానియేలు, రఫాయేలు, విజయకుమార్, జోసెఫ్, ఇమ్మానుయేలు, ఐజాక్, రవి డానియేలు, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో బాలల హక్కుల కమిషన్ చైర్మన్

తిరుమల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ తిరుమలలో కొంత మంది బాలలు భిక్షాటన చేయడంతో పాటు బొమ్మలు విక్రయిస్తూ కనిపించారని చెప్పారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించే దిశగా విద్యాశాఖ అధికారులు అడుగులు వేయాలన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు

- సచివాలయాలతో నవశకానికి నాంది
- గ్రామాల్లో రూపురేఖలు మార్చిన సచివాలయ వ్యవస్థ

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. గత టీడీపీ పాలనలో ప్రభుత్వ పథకాల ఫలాలు అర్హులకు చాలావరకు అందలేదు. వాటిని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అనుయాయులకు జన్మభూమి కమిటీలు పోషించిన పాత్ర ఎంతచెప్పినా తక్కువే. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఈ అక్రమాలు, అవినీతికి కళ్లెం వేసింది. అర్హుల ముంగిటకే సంక్షేమ పథకాల ఫలాలు చేరుస్తోంది.





చియ్యవరంలో ప్రారంభానికి సిద్ధమైన సచివాలయం, వృద్ధురాలికి పింఛను ఇస్తున్న వలంటీర్ అనిత

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని 27 పంచాయతీలలో 16 సచివాలయాలు ఉన్నాయి. వాటిలో 13 సచివాలయాలకు నూతన భవనాలు నిర్మించారు. 3 భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. 16 సచివాలయాల్లో 131 మంది ఉద్యోగులు, 232 వలంటీర్లు పనిచేస్తున్నారు.జ సచివాలయాల ద్వారా మొత్తం 536 సేవలను ప్రజలకు ప్రభుత్వం అందిస్తోంది.

సచివాలయాల్లో సేవలు మరింత సులభతరం

సచివాలయాల్లో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువులోపు వలంటీర్లు ఇంటికే వచ్చి కార్డులు అందజేస్తున్నారు. అలాగే ఇంటి స్థలాలు కోసం దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, అర్హత ఉంటే 90 రోజుల వ్యవధిలో స్థలం మంజూరు చేస్తున్నారు. ప్రజలకు ఏ అవసరం ఉన్నా సచివాలయాల సేవలతో పనులు సులువు కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ ప్రభుత్వంలో అవస్థలు

గత టీడీపీ ప్రభుత్వంలో ఏ చిన్న పని కావాలన్నా జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సిందే. వారికి అనుకూలంగా ఉంటేనే పనులు చేసేవారు లేకపోతే కాలయాపన చేశారు. ప్రజలకు అవసరమయ్యే పత్రాలు కావాలన్నా నానా అవస్థలు పడేవారు. రెవెన్యూ సంబంధిత పత్రాలు కావాలంటే మీ–సేవ కేంద్రాలు చుట్టూ తిరగాల్సిందే. అర్హత ఉన్ననూ సంక్షేమ పథకాలు పొందాలన్నా, రేషన్‌కార్డులు కావాలన్నా వారాలు, నెలల తరబడీ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అంతేకాకుండా ఈ కార్డులకు కూడా పల్స్ సర్వే పేరుతో కోత పెట్టేవారు.

సచివాలయాల్లో అందించిన సేవలు

మొత్తం అర్జీలు సంఖ్య :	7000(3.6 ఏళ్లలో)
పరిష్కారమైనవి :	6, 800
వివిధ కారణాలతో తిరస్కరించినవి :	200
పెన్షన్లు :	6672 మందికి 1.92కోట్లు (నెలకు)
మంజూరు చేసిన జగనన్న ఇళ్లు :	1017
మంజూరు చేసిన రేషన్‌కార్డులు :	3950
ఆరోగ్య శ్రీ కార్డులు :	3950
చేయూత దరఖాస్తులు :	2920 మందికి రూ.10.05 కోట్లు
వైఎస్ఆర్ ఆసరా దరఖాస్తులు:	8891 మందికి రూ.17.94 కోట్లు
ఇంటి పట్టాలు :	3163

జగనన్నకు కృతజ్ఞతలు



గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. మాకు ఏ పని కావాలన్నా సచివాలయాల్లో చేసుకుంటున్నారు. దరఖాస్తు చేసుకున్నా వెంటనే మాకు 72 గంటలలో క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు అందిస్తున్నారు.గ్రామంలోనే ప్రతి పని సులభతరం కావడంతో సంతోషంగా ఉంది.

–చెంగా పోలమ్మ... కొన్నలి ఎస్టీ కాలనీ

ఇంటి వద్దకే సేవలు



సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో మాకు ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. గత ప్రభుత్వంలో పింఛను తీసుకోవాలన్నా ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ఒకటవ తేది ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారు. ఏ ధ్రువపత్రాలు కావాలన్నా వలంటీర్లకు చెబితే వారే అన్నీ సిద్ధం చేస్తున్నారు.

–ఎం.విజయ, కొన్నలి, తొట్టంబేడు

అర్హులకు సంక్షేమం



సచివాలయాలు వచ్చిన తరువాత ఏ పథకమైనా గ్రామాల్లో అర్హులందరికీ చేరవేస్తున్నాం. సచివాలయ ఉద్యోగులు వారికి అనుబంధంగా వలంటీర్ల వ్యవస్థ ఉండడంతో ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్నారు. అర్హులైన వారు నష్టపోకూడదు అన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష ద్వారా అర్హులను గుర్తించి వారికి కూడా సంక్షేమ పథకాలు అందించేదానికి కృషి చేస్తున్నాం.

–సురేష్‌బాబు, ఎంపీడీఓ, తొట్టంబేడు

ఎంతదూరంలో ఉన్నా..



నేను వలంటీర్‌గా 50 ఇళ్లకు సేవలందిస్తున్నాను. ప్రతి నెలా ఒకటవ తేది తెల్లవారుజామున నుంచే పింఛన్లు ఇస్తున్నాం. దీర్ఘకాలంగా వ్యాధులతో బాధపడుతున్న వారు దూరప్రాంతాల్లో ఉన్నా అక్కడికి వెళ్లి ఇస్తున్నాం.

–దావాల సుబ్బు, చియ్యవరం

కీలకంగా వ్యవహరిస్తున్నా



ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎప్పటికప్పుడు నా సచివాలయ పరిధిలో ప్రజలకు చేరవేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నా. ఉద్యోగ పరంగా ప్రజలకు సేవ చేయడంలో సంతృప్తిగా ఉంది.

–కె.జ్ఞాన ప్రకాష్, పంచాయతీ సెక్రటరీ, సాంబయ్యపాళెం, తొట్టంబేడు

‘ఆరులేన్ల’ను దాటేందుకు దారి కల్పించరూ!



కారూరు పొన్నియమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

–ఎమ్మెల్యేకు కారూరు ప్రజల వినతి

పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం కారూరు ప్రజలు తమ గ్రామ సరిహద్దుల్లో ఆరులేన్ల రహదారి నిర్మాణ పనులు చేస్తున్నారని, రోడ్డుకు అవతలివైపు తమ చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు సుమారు 400 ఎకరాలు పొలాలు ఉన్నాయని, అటువైపు దాటడానికి దారి కల్పించాలని కారూరు గ్రామస్తులు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు విజ్ఞప్తి చేశారు. పశువులను కూడా మేపు కోసం అటువైపు వెళ్లవలసి ఉందని నివేదించారు. స్పందించిన ఎమ్మెల్యే రహదారి పనులు చేస్తున్న వారి దృష్టికి సమస్యను ఫోన్‌లో తెలియజేశారు.

పొన్నియమ్మకు పూజలు

కారూరులోని పొన్నియమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న ఆయనకు తీర్థ ప్రసాదాలు అర్చకులు ప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనం పలికారు.

ఏఎంసీ మాజీ డైరెక్టర్‌కు పరామర్శ

కారూరుకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏఎంసీ మాజీ డైరెక్టర్ లలితమ్మను ఎమ్మెల్యే పరామర్శించారు. తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రి పాలై చికిత్స అనంతరం లలితమ్మ ఇంటికి చేరుకున్నారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే మధ్యాహ్నం ఆమె ఇంటికి వెళ్లి మాట్లాడారు.

జగనన్న సురక్షతో సర్టిఫికెట్ల సమస్యలకు చెక్

జగనన్న సురక్షతో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల సమస్యకు చెక్ పెట్టాలని ఎమ్మెల్యే అన్నారు. అందుబాటులో ఉన్న పిచ్చాటూరు, నాగలాపురం మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే పిచ్చాటూరులో సమావేశమయ్యారు. జగనన్న సురక్ష సర్వేలో అధికారులు, వలంటీర్లతో కలిసి ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని, సర్టిఫికెట్ల కోసం ఇబ్బంది పడుతున్న వారి సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సర్వేతో ప్రజలకు వంద శాతం సంతృప్తి కలిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, నాగలాపురం మండల కన్వీనర్ అపరంజిరాజు, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, మాజీ వైస్ ఎంపీపీ పాల పద్మనాభం, నియోజకవర్గ వైఎస్ఆర్ టీయూసీ అధ్యక్షులు ఎస్ఎం సురేష్, నాయకులు రాజ, చలపతిరాజు, కిరణ్‌కుమార్, మైఖేల్, సుబ్రమణ్యం రెడ్డి, శేఖర్, బాబు రెడ్డి, దేశప్పన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

‘స్వర్ణముఖి మ్యూజిక్’ పాట చిత్రీకరణ



పాట చిత్రీకరణను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పెండ్లిమండపం వద్ద స్వర్ణముఖి మ్యూజిక్ యూట్యూబ్ చానల్ ఆధ్వర్యంలో పాట చిత్రీకరణను ఆదివారం ప్రారంభించారు. నిర్మాత గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ గతంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి గురించి చిత్రీకరించిన పాట విజయవంతమైందన్నారు. ప్రస్తుతం పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులను అనాథ శరణాలయాలు, రోడ్లపై వదిలివేస్తున్న వారికి ఈ పాట ఓ సందేశమన్నారు. కార్యక్రమంలో ఉంగరాల మునెయ్య, సాంబ రషీద్, గంగపుత్ర గాంధీ, నెల్లూరు జగదీష్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఎండీపుత్తూరులో ఎండుతున్న వరి

ఎండుతున్న వరి

- లబోదిబోమంటున్న రైతులు

ఏర్పేడు: ఎస్పీడీసీఎల్ అధికారుల నిర్లక్ష్యంతో ఎండీపుత్తూరులో వరి ఎండిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దాదాపు 20 రోజుల క్రితం మండలంలో గాలీవానకు ఎండీపుత్తూరు పొలాల్లోని రైతులు నాగార్జునరెడ్డి, మోహన్‌రెడ్డి, మునిరెడ్డి, మునికృష్ణారెడ్డి పొలాలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ నేల కొరిగింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద సుమారు 7 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటి వరకు ఎస్పీడీసీఎల్ అధికారులు మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయకపోవడంతో పొలాలకు నీరు పారించలేక, వరి ఎండిపోతోంది. అధికారులకు నివేదించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై ఎస్పీడీసీఎల్ ఏఈ మునికుమార్‌ను వివరణ కోరగా రెండు రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

పూర్వ విద్యార్థుల విరాళం



విరాళమిస్తున్న పూర్వ విద్యార్థులు

నారాయణవనం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.50 వేల విరాళాన్ని చెక్కు రూపంలో ఆదివారం అందజేశారు. ఇక్కడ 1990–91లో పదవ తరగతి చదివిన ఈ విరాళాన్ని ఉపాధ్యాయులు సురేష్ బాబు, శ్రీనివాసులు, మునివేలుకు అందజేశారు. సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన సూక్ష్మదర్శినిల కొనుగోలుకు ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మునిబాబు, రమేష్, జయరాం, గోపి, గణేష్, గిరిధర్ యాదవ్, దొరస్వామి, హరిబాబు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పరాశరేశ్వరుడి కటాక్షం



ఊరేగింపులో పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో ఆదివారం సాయంత్రం రథోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్య పూజా కైంకార్యలు, పరివార దేవతలకు అభిషేకాలు, స్నపన తిరుమంజనం నిర్వహించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయంలో చెక్క రథం లేకపోవడంతో సాయంత్రం సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి భక్తులను కటాక్షించారు. స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ దేవేందర్, ఏఈఓ పార్థసారతి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం నిర్వహించే ఆర్జిత కల్యాణోత్సవంలో రూ 500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చునని డిప్యూటీ ఈఓ తెలిపారు.

జగనన్న సురక్షపై ఇంటింటా సర్వే



సర్వే చేస్తున్న వలంటీర్

బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న సురక్ష పథకంపై బుచ్చినాయుడుకండ్రిగలో ఆదివారం వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి, ఆన్‌లైన్‌లో యాప్‌లో సమస్యల వివరాలను పొందుపరచారు. జగనన్న సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించారు. నమోదైన సమస్యలను 1వ తేదీన గ్రామ సచివాలయాల పరిధిలో పరిష్కరిస్తామన్నారు.

ఎమ్మెల్యేపై నిందారోపణలు చేస్తే సహించం



మాట్లాడుతున్న ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి

రేణిగుంట: నిత్యం ప్రజలో ఉంటూ, సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి నిందారోపణలు చేస్తే సహించేది లేదని ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం రేణిగుంట పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎమ్మెల్యేపై బొజ్జల సుధీర్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఖండించారు. నియోజకవర్గంలో 30ఏళ్లలో జరగని అభివృద్ధిని తమ ఎమ్మెల్యేగా చేసి చూపించారని, ఈసారి ఆయన గెలుపు తథ్యమని భావించిన సుధీర్‌రెడ్డి ఆయనపై చౌకబారు ఆరోపణలు చేస్తున్నా రని మండిపడ్డారు. జెడ్పీటీసీ సంధ్య మాట్లాడుతూ, ఎల్లమండ్యానికి చెందిన టీడీపీ నాయకుని కాలువ భూఆక్రమణ వల్లే వరదల్లో జీవాగ్రం, కేఎల్ఎం ఆస్పత్రి ఇళ్లు మునిగిపోయాయన్నారు. పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పేరూరు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ, సుధీర్‌రెడ్డికి ఎమ్మెల్యే సీటు దక్కదనే భయంతో చంద్రబాబు మెప్పుకోసం దిగుజారుడు రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నాసామిపల్లె భూముల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని, రెవెన్యూ అధికారులు ఎవరికీ భూములు ధారాదత్తం చేయలేదన్నారు. ఏళ్ల తరబడి కోర్టుల్లో ఆ భూముల కేసులు నడుస్తుండగా, తమకు అనుకూలంగా తీర్పులు వచ్చాయన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, వైస్ ఎంపీపీ సుజాత, మండల కో–ఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజు, ముస్లిం మైనారిటీ మండల కన్వీనర్ ఖదీర్ తదితరులు సుధీర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

మునీశ్వరస్వామి ఆలయంలో పూజలు





మునీశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పవిత్రారెడ్డి విశేష అలంకరణలో ఓం కాళికమ్మల్

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం మునీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తొట్టంబేడు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి పూజలు చేశారు. గ్రామస్తులు ఆలయంలో ప్రతి ఏటా పూజలు చేయడం ఆనవాయితీ. గ్రామస్తుల ఆహ్వానంపై ఆమె ఆలయంలో అర్చనలు, పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, మాజీ ఎంపీటీసీలు చెంబేటి మునిరత్నంరెడ్డి, కోదండరామిరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, హరిదాసురెడ్డి, గుణశేఖర్, సుకన్య, రవి, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఓం కాళికమ్మాల్ ఆలయంలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీ సెలంవారి ఇండ్లుకాలనీలో ఆదివారం ఓం కాళికమ్మాల్‌కు భక్తులు ఘనంగా పూజలు చేశారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. ప్రసాదాలను పంపిణీ చేశారు. ప్రతి ఏటా 9 రోజులపాటు పూజలు చేసి, జాతర నిర్వహించడం ఆనవాయితీ అని కాలనీవాసులు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

శ్రీకాళహస్తి: పట్టణంలోని తెట్టు ప్రాంతంలో ఆదివారం ప్రెస్‌క్లబ్, ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. దాదాపు 150మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ, తమ ఆస్పత్రి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తితో పాటు పరిసర గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ కింద వైద్యపరీక్షలు, ఉచిత శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కంఠా రమేష్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కామేష్, సీనియర్ పాత్రికేయులు రవి, వీసీ వెంకటయ్య, నెల్లూరు శ్రీను, సూర్యకుమార్, బాలు, తేజ, వైద్యులు దినేష్, ఉమామహేశ్వరరావు, దిలీప్, అర్చన, సిబ్బంది మధు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఆదివారం సర్పంచ్ లలిత, తిరుపతి జేపీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించినన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. పాపానాయుడుపేట, మర్రిమంద, పెనుమల్లం, పెన్నగడం, చెన్నంపల్లి తదితర గ్రామాల నుంచి వచ్చిన రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పలువురికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుడు కరుణాకరన్, డాక్టర్లు దామోదరం, పురుషోత్తం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాడ్ ఊడిపాయె.. బస్సు ఆగిపాయె!



బస్సు నుంచి ఊడి రోడ్డు మీద పడిన రాడ్

రేణిగుంట: రాడ్ ఊడిపాయె..బస్సు ఆగిపాయె.. అని నిట్టూర్చుతూ ఆర్టీసీ ప్రయాణికులు మరో బస్సును ఎక్కి తమ గ్రామాలకు వెళ్లిన సంఘటన ఆదివారం సాయంత్రం రేణిగుంటలో చోటుచేసుకుంది. వివరాలు..సరస్వతికండ్రిగ సర్వీసు (ఏపీ21జడ్0328)తిరుపతిలో సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో బయల్దేరింది. ప్రయాణికుల తాకిడితో రేణిగుంట బస్టాండ్ వరకూ రయ్యిన చేరింది. ఆ తర్వాత బయల్దేరిన బస్సు పాత చెక్ పోస్ట్ దాటగానే పెద్దశబ్దం వస్తూండడంతో స్థానిక ఇన్‌ఫాంట్ జీసస్ ఇంగ్లిష్ మీడియం వద్ద బస్సును డ్రైవర్ ఆపేశాడు. దిగి చూస్తే రాడ్డు ఊడిపోయి రోడ్డుకు తగులుతూ శబ్దం వస్తున్నట్లు గుర్తించాడు. ఇక, బస్సు కదలడానికి ఆస్కారం లేదని గుర్తించిన కండక్టర్, డ్రైవర్ వెనుకనే వస్తున్న మరో బస్సులోకి ప్రయాణికులను ఎక్కించారు. బస్సు పడకేసిన వైనాన్ని గ్యారేజి మెకానిక్స్ సమాచారం చేరవేశారు. వాస్తవానికి ఈ సర్వీసు మంచి కలెక్షన్స్‌తో నడుస్తోంది.

నల్లగంగమ్మ ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: పట్టణంలో తెట్టు ప్రాంతంలోని నల్లగంగమ్మ అమ్మవారికి వెండి కవచం ఏర్పాటుకు ఆదివారం రివర్‌ఫ్రంట్ ఎస్టేట్ ఆధ్వర్యంలో రూ.80వేల విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు కంఠా రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యంనాయుడు, కంఠా వెంకటేశ్వర్లు, జి.వెంకట్రామానాయుడు, విజయబాబు, చిలుకూరు సిద్దు నాయుడు, దొడ్డ నాగేశ్వరరావు, కోదండన్, సోమశేఖర్, రుద్రరాజు, చంద్రబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేయరూ!



గుంతలమయమైన ఆలత్తూరు రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి గ్రామాలకు కేటీరోడ్డు నుంచి ఉన్న రోడ్డు గుంతలమయం కావడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కేటీరోడ్డు నుంచి ఈ గ్రామాలకు 18 కిలోమీటర్లు తారురోడ్డు ఉంది. ఈ రోడ్డును 2016లో ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద వేశారు. రోడ్డు పనులను కాంట్రాక్టరు నాసిరకంగా వేయడం, అధికారుల పర్యవేక్షణ లోపించడం, 8 ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని మండిపడుతున్నారు. వర్షం పడితే గుంతల్లోకి నీరు చేరి రొచ్చురొచ్చుగా మారుతోంది. ఈ మార్గంలో ప్రయాణం వాహనదారులకు సైతం ఇబ్బందికరంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

హనుమంత వాహనంపై కల్యాణ వెంకన్న అభయం



చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాల్లో రెండో రోజు ఆదివారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు వేడుకగా స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం ఊంజల్‌సేవ చేపట్టారు. రాత్రి స్వామి వారు హనుమంత వాహనంపై కొలువుదీరి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గురుమూర్తి, సూపరింటెండెంట్ ముని చెంగల్రాయులు పాల్గొన్నారు.